www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 3 అక్టోబరు 2024

5

ఏలూరు



ధాన్యం లారీలకు టోల్ వసూళ్లు ఆపండి

జెసికి రైతుల విజ్ఞప్తి

ఉంగుటూరు: ధాన్యం సేకరణ సమయంలో కల్లాల్లో ధాన్యం తూకం వేసేందుకు తీసుకెళ్లే లారీలకు ఉంగుటూరు టోల్‌ప్లాజా వద్ద ఫీజు లేకుండా చర్యలు తీసుకుంటే రైతులకు భారం తగ్గుతుందని పలువురు రైతులు అధికారులకు విన్నవించారు. ధాన్యం సేకరణ ఏర్పాట్ల పరిశీలనకు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీలక్ష్మి, డిఎస్ఒ సత్యనారాయణరాజు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, వ్యవసాయ శాఖ జెడి అబుదీఆలీ, భీమడోలు ఎడిఎ ఉషారాజకుమారి, తహశీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఉంగుటూరు ఎఒ ప్రవీణ్‌కుమార్ బుధవారం సాయంత్రం బాదంపూడి, వెల్లమిల్లి, రావులపర్రుల్లో పర్యటించారు. బాదంపూడిలో కోతకు సిద్ధమైన వరి పంటను పరిశీలించారు. ఈ నెల 15 నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయని, అప్పటి నుంచి ధాన్యం సేకరించాలని రైతులు తెలిపారు. రావులపర్రు మిల్లులో గోనె సంచులను జెసి పరిశీలించారు.

'ఆశా'కు అన్యాయం..!

టి.నరసాపురం మండలం గండిగూడెం ఆశా వర్కర్‌పై అధికారుల నిరంకుశత్వం

విచారణ లేకుండా తొలగింపు, నోటిఫికేషన్ లేకుండానే మరొకరు నియామకం

స్థానిక మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌ఒకు డిఎంహెచ్‌ఒ వత్తాసు

రాజకీయ నాయకులతో జత కట్టి నిబంధనలకు నీళ్లు

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటేనే బాధితురాలికి న్యాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిరంకుశ వైఖరి మరోసారి చర్చనీయాంశంగా మారింది. చిరుద్యోగులైన ఆశా వర్కర్ల విషయంలో నిబంధనలకు తిలోదకాలిచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టి.నరసాపురం మండలం గండిగూడెంలో ఆశా వర్కర్ తొలగింపు వ్యవహారంలో వైద్యఆరోగ్య శాఖాధికారులు వ్యవహరించిన తీరు హాట్‌టాపిక్‌గా మారింది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఆశా వర్కర్‌కు న్యాయం చేయాలని ఆశా వర్కర్లంతా వారం రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నా జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులకు పట్టని పరిస్థితి నెలకొంది. మెడికల్ సీట్ల కోటాపై ఇటీవల పిహెచ్‌సి డాక్టర్ల ఆందోళన సందర్భంలోనూ ఆందోళనలను అడ్డుకుంటూ డిఎంహెచ్‌ఒ వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప ఆశా వర్కర్ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కన్పించడం లేదు.

ఆశా వర్కర్‌కు మద్దతుగా ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

టి.నరసాపురం మండలం గండిగూడెం ఆశా వర్కర్ కె.లక్ష్మీమంగపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు కక్షగట్టి వ్యవహరిస్తున్న పరిస్థితి ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. స్థానిక మెడికల్ ఆఫీసర్, ఆసుపత్రిలో పని చేసే ఎంఎల్‌హెచ్‌ఒ (మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్)కు వంతపాడుతూ ఆశా వర్కర్ లక్ష్మీమంగను తొలగించిన తీరు చర్చనీయాంశంగా మారింది. నోటీస్ ఇవ్వకుండా, విచారణ జరపకుండా తొలగించినట్లు ప్రకటించడమే కాకుండా నోటిఫికేషన్ ఇవ్వకుండా మరొకరిని ఆమె స్థానంలో నియమించిన తీరు డిఎంహెచ్‌ఒ నిరంకుశ ధోరణికి నిదర్శనమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నాయకులతో జతకట్టి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈవిధంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. ఆశా వర్కర్ పనితీరులో ఏమైనా లోపాలు ఉంటే మాట్లాడాలి, అప్పటికీ మారకపోతే నోటీసులు ఇవ్వాలి. పనిలో తీవ్రమైన తప్పిదాలు ఉంటే విచారణ చేసి చర్యలు తీసుకోవచ్చు. అలాకాకుండా మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌ఎహెచ్‌ఒ చెప్పారని నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్‌ను తొలగించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. దీనివెనుక పెద్ద గూడుపుఠాణి జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కక్షతోనే ఆశా వర్కర్‌ను తొలగించినట్లు తెలుస్తోంది. పిహెచ్‌సిలో పనిచేసే అధికారులకు, ఆశావర్కర్ కుటుంబంలోని వ్యక్తులకు మధ్య ఉన్న తగవుల కారణంగా ఆశా వర్కర్‌పై కక్ష సాధిస్తున్నట్లు పెద్దఎత్తున చర్చ సాగుతోంది. టిడిపికి చెందిన కొంతమంది నాయకుల అండతో స్థానిక వైద్యాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆశా వర్కర్‌ను తొలగించాలంటే అందుకు సంబంధించిన మండలంలోని కమిటీ నిర్ణయం తీసుకోవాలి. కమిటీలోని కీలకమైన ప్రజాప్రతినిధి ఒకరికి అసలు విషయం చెప్పకుండా, సంతకాలు తీసుకుని ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తప్పు తేల్చాల్సిన జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు చర్చ నడుస్తోంది. ఆశా వర్కర్‌ను తొలగిస్తూ ఆర్డర్ సిద్ధం చేసి ఇచ్చేందుకు సైతం సిద్ధమవ్వగా ఈలోపు సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు ఆందోళనకు దిగడంతో ఆర్డర్ కాపీ ఆమెకు ఇవ్వలేదని తెలుస్తోంది. ఆమె స్థానంలో మాత్రం వేరొకరిని నియమించి పనులు మాత్రం సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆశా వర్కర్‌ను తొలగిస్తే ఆ స్థానం ఖాళీగా ఉందని చూపించి, నోటిఫికేషన్ విడుదల చేసి నియామకం చేపట్టాలి. ఇక్కడ అటువంటి ప్రక్రియ ఏమీ లేకుండానే వేరొకరిని నియమించిన పరిస్థితి నెలకొంది. దీన్నిబట్టి జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఏవిధంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అనేక విషయాల్లో డిఎంహెచ్‌ఒ శర్మిష్ఠ తీరు వివాదాస్పదమవుతోంది. తాజాగా గండిగూడెం ఆశా వర్కర్ తొలగింపు సైతం మరోసారి చర్చనీయాంశంగా మారింది. నీట్ సీట్ల కోటాకు సంబంధించి ఇటీవల పిహెచ్‌సి వైద్యులు ఆందోళనకు దిగగా వారు వేసిన టెంట్లు తొలగించి బెదిరింపుల పర్వానికి దిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదేవిధంగా ఆశావర్కర్ విషయంలోనూ వ్యవహరిస్తున్న తీరు మరోసారి చర్చకు దారితీసింది. రాజకీయ కక్ష సాధింపులకు అధికారులు వత్తాసు పలకడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఆశా వర్కర్ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప సమస్య పరిష్కారమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. స్థానిక ఎంఎల్‌ఎ సైతం జోక్యం చేసుకుని ఆశా వర్కర్‌కు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

నిబంధనలు పాటించకుండా తొలగింపు దారుణం

ఆర్. లింగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

ఆశా వర్కర్ విషయంలో మరోసారి విచారణ చేయిస్తానని డిఎంహెచ్‌ఒ హామీ ఇచ్చి నిర్లక్ష్యంగా పక్కన పెట్టేశారు. వెంటనే విచారణ చేసి తగిన న్యాయం చేయాలి. చట్టపరమైన ప్రొసీజర్ ఏఒక్కటీ అమలు చేయకుండా ఆశావర్కర్‌ను తొలగించడం దారుణం. ఆశా వర్కర్ తొలగింపునకు సంబంధించి మండలస్థాయి కమిటీ తీర్మానం లేదు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా సమస్యను పరిష్కరించాలి.

నోటీసు, విచారణ లేకుండా ఏవిధంగా తొలగిస్తారు

కె.పోశమ్మ, ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

పిహెచ్‌సిలో తప్పు చేసిన వ్యక్తిని తొలగించకుండా తప్పు చేయని ఆశావర్కర్‌ను తొలగించడం అత్యంత దారుణం. నోటీస్, విచారణ లేకుండా ఏవిధంగా తొలగిస్తారో అధికారులు చెప్పాలి. మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌ఒ తీరు ఏమాత్రం బాగోలేదు. ఖాళీ అయినట్లు నోటిఫికేషన్ ఇవ్వకుండా కొత్త వ్యక్తిని ఏ నిబంధనల ప్రకారం నియమించారో చెప్పాలి. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం.

నిరసన దీక్షలో నినదిస్తున్న కార్మిక, ప్రజాసంఘాల నేతలు

విశాఖ ఉక్కుపై కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ

కార్మిక సంఘాల నిరసన దీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక వసంత మహల్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ దీక్ష చేపట్టారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వెనక్కి తీసుకోవాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని పెద్దఎత్తున నినదించారు. దీక్షల్లో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శులు డిఎన్‌విడి.ప్రసాద్, కె.బుచ్చిబాబు, బి.వెంకట్రావు ఆధ్వర్యంలో ఎర్రని దండలు ధరించి దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎఐటియుసి సీనియర్ నాయకులు కె.కృష్ణమాచార్యులు, ఐఎఫ్‌టియు నాయకులు రాంబాబు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుందని విమర్శించారు. మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేట్ పరం చేయాలని మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేసిందని, రాష్ట్ర ప్రజానీకం మద్దతుతో కార్మికులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టిన ఫలితంగా వెనుకడుగు వేసిందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పథకం ప్రకారం స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాలు వస్తున్నాయనే పేరుతో నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే అత్యంత నాణ్యమైన విశాఖ స్టీల్ ఉత్పత్తిని కావాలనే బిజెపి ప్రభుత్వం తగ్గించి నష్టాల్లోకి నెట్టి ప్రయివేటుపరం చేసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్‌వర్మ విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే అత్యుత్తమ స్టీల్‌ప్లాంట్ అని అన్నారని గుర్తు చేశారు. 45 రోజుల్లోనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రణాళిక సిద్ధం చేస్తామని, మోడీని ఒప్పించి స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికి రెండు మాసాలైనా స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడపడానికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా ప్లాంటును నాశనం చేసేందుకు అన్ని ప్రయత్నాలూ ముమ్మరం చేసిందన్నారు. టిడిపి మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కనీసం ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బిజెపిపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపిస్తూ, మూడు లక్షల కోట్ల సంపద కలిగిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు పరం చేయాలని చూస్తే రాష్ట్రంలోని రైతులు, కార్మికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే ఆలోచనను మోడీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆర్.శ్రీనివాస్ డాంగే, ఎం.కృష్ణచైతన్య, పుల్లారావు, బాబు, అప్పలరాజు, కె.అప్పారావు, పి.కన్నబాబు, బి.శ్రీనివాస్, ఐఎఫ్‌టియు నాయకులు కాకర్ల శ్రీను, రాఘవ, పి.గంగరాజు, తారక్, ఎస్.నాగేశ్వరరావు, ఎం.రాము, టి.శ్రీను, సిఐటియు నాయకులు బి.సోమయ్య, వివిఎన్.ప్రసాద్, జె.గోపి, జాన్‌బాబు, టిపిఆర్.దొర, పి.హైమావతి, అరుణకుమారి, మొహిద్దీన్, కుమార్ నాయకత్వం వహించారు.

గాంధీ ఆశయాలకు అనుగుణంగా అడుగులు

కలెక్టరేట్‌లో జాతిపితకు ఘనంగా నివాళులు

ప్రజాశక్తి - ఏలూరు

జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేద్దామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. బుధవారం స్వాతంత్ర సమరయోధుడు, జాతిపిత మహాత్మాగాంధీ జయంతి, మన దేశ రెండో ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని ఏలూరు కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ డి.పుష్పమణి కలిసి పూలమాలలు, నూలుదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో గాంధీజీ ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. ప్రధానంగా సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్రం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప మహనీయుడు గాంధీ అన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి వంటి మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

వసతిగృహాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని కొవ్వలిలో సాంఘిక సంక్షేమ సమీకృత బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహం వద్ద డ్రెయినేజీ సమస్య, మురుగునీరు పారుదల తదితర విషయాలపై చర్యల కోసం గత నెల 26న సంబంధిత అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఆ వసతిగృహాన్ని బుధవారం సందర్శించిన కలెక్టర్ అక్కడ పనులను పరిశీలించారు. డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. పగిలిపోయిన పైపులైనును మార్పు చేయాలని ఆదేశించారు. అదే విధంగా పాడైపోయిన డోర్లు, కిటికీలను మరమ్మతు చేసేందుకు అంచనాలు తయారు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పూర్తిస్థాయిలో పనులన్నింటినీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, తహశీల్దారు సుమతి ఉన్నారు.

హాస్టల్‌లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న వెట్రిసెల్వి

బిసి విద్యార్థినుల కళాశాల వసతిగృహం తరలింపునకు భవనం గుర్తించండి

అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలోని బిసి విద్యార్థినుల కళాశాల వసతిగృహాన్ని, బాలికల బిసి వసతిగృహాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం సందర్శించారు. డ్రెయిన్‌లో పూడికతీత పనులను మరింత వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బిసి హాస్టల్ నెంబరు-2లో మర్మతులకు సంబంధించిన అంచనాలపై పంచాయతీరాజ్ ఇంజినీర్లతో ఆమె సమీక్షించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసే పనులను కలెక్టర్ పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన బిసి విద్యార్థినుల వసతిగృహాన్ని వెంటనే ప్రభుత్వ లేదా ప్రయివేట్ భవనంలోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా బిసి సంక్షేమాధికారిని ఆదేశించారు. నగరంలో భవనాన్ని గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను కూడా కలెక్టర్ ఆదేశించారు. వారు చదువుతున్న కళాశాల సమీపంలో వసతిగృహం ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్, మున్సిపల్ కమిషనర్ ఎన్.భానుప్రతాప్, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, డిసిపిఒ సూర్యచక్రవేణి, తహశీల్దార్ ఎన్‌వి.శేషగిరి తదితరులు ఉన్నారు.

పరివర్తన చాలా కీలకం : ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

మానవ జీవితంలో పరివర్తన చాలా కీలకం, ముఖ్యమని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. జిల్లా కేంద్ర కారాగార జైలులో గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనయ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంలోగాని, చెడు వ్యసనాల వల్లగాని నేరాలకు అలవాటు పడిన వారు గాంధీ చరిత్ర చదివి పరివర్తన చెందాలని, గాంధీ చరిత్ర ఎప్పుడు చదివినా నిరంతరం అనేక విషయాలను గ్రహించవచ్చని అన్నారు. తప్పు చేసిన ప్రతి మనిషీ పరివర్తన చెందాలని, ఇక్కడ తలదించుకుని ఉన్న కొంతమంది భవిష్యత్తులో సమాజంలో తల ఎత్తుకుని తిరిగేలా పరివర్తన చెందాలని అన్నారు. పరివర్తన చెందిన ఖైదీలకు పోలీస్ వ్యవస్థ ద్వారా నడుపుతున్న పోలీసు పెట్రోల్ బంక్‌లో ఉద్యోగావకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఎవరూ పుడుతూనే నేరస్తులు కాదని, సమాజంలో పెరిగిన విధానం వల్ల కొంతమంది ఇటువంటి వాటికి అలవాటు పడి కారాగారం పాలయ్యారని అన్నారు. ఇకనైనా మెరుగైన జీవన విధానం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ జ్యుడీషియల్ జడ్జి పోక్సో యాక్ట్ ఎస్.ఉమాసునంద, సెకండ్ అదనపు జడ్జి మంగతాయారు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కె.రత్నప్రసాదు, జిల్లా కారాగార కేంద్రం సూపరింటెండెంట్ సిహెచ్‌ఆర్‌వి.స్వామి, జైలర్-1 కె.వెంకటరెడ్డి, జైలర్-2 కె.శ్రీనివాసరావు, జైలు సిబ్బంది, సిఐలు మల్లేశ్వరరావు, సత్యనారాయణ, ఎం.సుబ్బారావు, వైవి.రమణ, ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, క్రాంతిప్రియ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

సమస్యలు పరిష్కరించాలని సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ముందు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నగరాధ్యక్షులు షేక్ ఫర్వీన్ బేగం, ప్రధాన కార్యదర్శి రాజారావు జొన్నకూటి మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. మున్సిపాల్టీల్లో ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి ప్రమోషన్ కల్పించాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులను ఎంఇఒలుగా నియమించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలని, మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి సుభాషిణి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తాఫ్ ఆలీ, రుద్రాక్షి రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ దుర్గ భవాని, జిల్లా కార్యదర్శి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో ఉపాధ్యాయులు

నేటి నుంచి టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల మూడో తేదీ గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్న ఎపి టెట్-2024 పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు. ఏలూరు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ స్కూల్‌లో ఈ నెల మూడో తేదీ నుంచి 21వ తేదీ వరకూ నిర్వహించే పరీక్షలకు మొత్తం 5,470 మంది హాజరు కానుండగా ఉదయం పూట పరీక్షలకు 2,965 మంది, మధ్యాహ్నం నిర్వహించే పరీక్షలకు 2,505 మంది చొప్పున మొత్తం 5,470 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. వట్లూరులోని సర్ సిఆర్‌రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈ నెల ఆరో తేదీన ఒక రోజు నిర్వహించే పరీక్షలకు ఉదయం వంద మంది, మధ్యాహ్నం వంద మంది మొత్తం 200 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. రెండు కేంద్రాల్లో కలిపి మొత్తం 5,670 మంది టెట్ పరీక్షకు హాజరవుతారని చెప్పారు. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నిమిషాల నుంచి ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. హాల్‌టికెట్‌లో ఏమైనా తప్పులుంటే అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి పరీక్షా కేంద్రం దగ్గర నామినల్ రోల్స్‌లో సరిచేయించుకోవచ్చని, దీనికోసం పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లు చేశామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11, 12 తేదీల్లో మినహా 21వ తేదీ వరకు పరీక్షలు సాగుతాయని, ఏవైనా సందేహాలుంటే పర్యవేక్షకులు-8328186618, సెక్షన్ అసిస్టెంట్-9030723444కు పని దినాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని అన్నారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డులో పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా హాజరుకావాలని కోరారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి 300 మందికి ఒక డ్యూటీ ఆఫీసర్‌ను ఏర్పాటు చేశామని, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. విభిన్నప్రతిభావంతులు 32 మందికి సహాయకులను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రథమ చికిత్సా కేంద్రాలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు.

రూ.300 కోట్లతో హెచ్‌పిసిఎల్ బయోగ్యాస్ ప్లాంట్

శంకుస్థాపన చేసిన దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని కండ్రిక నరసాపురంలో సుమారు రూ.300 కోట్ల పెట్టుబడితో హెచ్‌పిసిఎల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న బయో గ్యాస్ తయారీ ప్లాంట్‌కు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్లాంట్ నిర్మాణ పనులపై కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ హెచ్‌పిసిఎల్ సంస్థ ఆధ్వర్యంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడంతోపాటు ఆర్గానిక్ ఎరువు ఉత్పత్తి చేసేలా కూడా చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా సమీప గ్రామాల్లోని సుమారు 150 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. త్వరితగతిన ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయడానికి సుమారు రెండున్నరేళ్ల కాలం పడుతుందన్నారు. ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వ సహకరిస్తుందని తెలిపారు. ముడిసరుకుగా పామాయిల్ మట్టలను కూడా సద్వినియోగం చేసుకునేలా ప్లాంట్ నిర్వాహకులు పరిశోధనలు చేసి, అది సాకారం చేసేలా కృషి చేయాలని, తద్వారా స్థానిక రైతాంగానికి, ప్లాంట్ అభివృద్ధికి మేలు జరుగుతుందని ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మాగంటి నారాయణప్రసాద్, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ శ్రీలత, జిఎన్ కనస్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధులు, పలువురు కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్

వంద పడకల ఆస్పత్రి పనుల నిలిపివేత

చింతలపూడి: పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు నాసిరకంగా చేపడుతున్నారనే ఆరోపణలు రావడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణ, అభివృద్ధి కమిటీ వైస్ ఛైర్మన్ కొండ్రు దేవ అక్కడికి చేరుకుని పనులను నిలిపివేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తోటల్లో ఇసుక తీసుకొచ్చి పనులు చేస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లేదని ప్రచారం సాగడంతో వారు నిర్మాణ పనుల వద్దకు చేరుకుని పరిశీలించారు. ఇసుక సరిగా లేదని గుర్తించారు. మళ్లీ ఇలా పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఇసుక కొరత ఉందని వైస్ ఛైర్మన్ కొండ్రు దేవా ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా అటువంటి ఇబ్బందేమీ లేదని అధికారులు సమాధానమిచ్చారు. ఇసుక కొరత లేనప్పుడు, వాగుల్లో, తోటల్లోని ఇసుకతో పనులు ఎందుకు చేస్తున్నారని పలువురు నేతలు ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణానికి వాటరింగ్ సక్రమంగా చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయని, పనులు సక్రమంగా చేపట్టేలా చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్, జెడ్పి చైర్‌పర్సన్

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

సత్కరించిన కలెక్టర్, జెడ్పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి – ఏలూరు

స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పలువురు పారిశుధ్య కార్మికులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. జెడ్పి చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను ప్రతిఒక్కరూ గౌరవించాలని వారి అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, జెడ్పి సిఇఒ కెఎస్‌.సుబ్బారావు, డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలోని పరిసర ప్రాంతాల్లో రోడ్లను శుభ్రపరచడం అభినందనీయమని స్వామ్ ఐటిఐ కాలేజ్ సెక్రటరీ, కరస్పాండెంట్ కె.సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా స్వామ్ ఐటిఐ ముదినేపల్లి కాలేజ్‌లో గాంధీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.హరిత, సిబ్బంది ఒ.మణిభీమరాజు, బి.కృష్ణమోహన్, వి.ఎన్.విజయదుర్గ, జి.ఎస్‌.శివ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : స్వామ్ ఐటిఐలో స్వచ్ఛత హి సేవ

'చెత్తను తొలగించకుండా స్వచ్ఛత గ్రామసభలా'

మండవల్లి : చెత్తను, మురుగును తొలగించకుండా స్వచ్ఛత గ్రామ సభలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని గ్రామస్తులు ప్రశ్నించారు. సర్పంచి మెండ రూప్సి అధ్యక్షతన స్థానిక నాగేంద్రస్వామి కళ్యాణ మండపంలో స్వచ్ఛత హి సేవ గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎక్కడెక్కడ ఏయే కార్యక్రమాలు నిర్వహించారో తెలపాలని ప్రశ్నించారు. ఎక్కడ ఉన్న చెత్తను, మురుగును తొలగించారు, దోమల మందు ఎక్కడ పిచికారీ చేయించారని ప్రశ్నించారు.

భీమడోలు : స్వచ్ఛతా హి సేవా ముగింపు కార్యక్రమాలు బుధవారం మండల వ్యాప్తంగా చేపట్టారు. మండల స్థాయిలో స్వచ్ఛతా హి సేవా ముగింపు కార్యక్రమాన్ని పోలసానిపల్లి గ్రామపంచాయతీ వద్ద నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, బిసి కార్పొరేషన్ జిల్లా అధికారి ఆర్‌వి.నాగరాణి, ఎంపిడిఒ పద్మావతి దేవి మాట్లాడారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, కౌన్సిలర్లు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా నూజివీడు పురపాలక సంఘ కార్యాలయాన్ని పరిశుభ్రం చేశారు. నూజివీడు ప్రధాన రహదారులలో ర్యాలీ నిర్వహించారు.

ప్రభుత్వ రాయితీని రైతులు వినియోగించుకోండి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి – ఏలూరు

గాంధీ జయంతి సందర్భంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రచురించిన ఉద్యానవన పంటల సేద్యం–2024–25 ఆర్థిక సంవత్సరంలో సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ, ఆర్థిక ప్రోత్సాహం ప్రచురించిన రైతు ఫీల్డ్ బుక్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ పంటకు ఒక్కొ హెక్టార్‌కు రూ.55,770 ఉద్యానశాఖ ద్వారా 60 మొక్కలకు సంబంధించి ఎరువులు, మొక్కలకు కలిపి మెటీరియల్ సబ్సిడీ ద్వారా రూ.28,860 చెల్లించనున్నట్లు తెలిపారు.

న్యాయం కోరుతూ ధర్నా

ప్రజాశక్తి – చాట్రాయి

మండలంలోని కోటపాడులో వేముల నాగేశ్వరరావు, వేముల శివకృష్ణ, వేముల దుర్గారావు అనే వ్యక్తులు ఇంటికి వెళ్లే తమ దారి మూసేసి గృహనిర్బంధం చేశారని, న్యాయం చేయాలని గ్రామానికి చెందిన చీపు ధర్మారావు, అతని కుటుంబసభ్యులు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ధర్మారావు, కుటుంబసభ్యులు వెంకటేశ్వరావు, నాగరాజు మాట్లాడుతూ మూడు తరాల నుంచి నడుస్తున్న దారికి ఫెన్సింగ్ వేసి గత పది రోజుల నుంచి తాము నడవకుండా గృహ నిర్బంధానికి గురి చేశారన్నారు. పశువుల మేతకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని, గ్రామంలో పెద్దలు పట్టించుకోకపోవడంతో రెండుసార్లు తహశీల్దార్‌కు చెప్పుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి కూడా దారి లేకుండా చేశారన్నారు. గత్యంతరం లేక తహశీల్దార్ కార్యాలయం వద్ద న్యాయం కోసం ధర్నా చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి దారి మూసిన వేసిన ఫెన్సింగ్ తీగ, రాళ్లు తొలగించి గృహ నిర్బంధం నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ద్వారకాతిరుమల : రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ద్వారకాతిరుమలలో బుధవారం పర్యటించారు. ముందుగా చినవెంకన్నను దర్శించుకున్నారు. పాత పోలీస్‌స్టేషన్ రోడ్డులో సీసీ రోడ్డును రూ.40 లక్షల వ్యయంతో నిర్మించేందుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పోలీస్‌స్టేషన్ నుంచి వసంత నగర్ కాలనీ వరకు రూ.94 లక్షలతో డ్రైనేజీ నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు.

అనారోగ్య బాధితునికి రూ.10 లక్షల చెక్కు

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మానూరి ప్రసాద్ కుమారుడు ప్రశాంత్ ఎనిమియా వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడి వైద్యం నిమిత్తం రూ.24 లక్షలు అవసరం కాగా గత ప్రభుత్వం రూ.14 లక్షలు మంజూరు చేసింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత గోపాలపురం ఎంఎల్ఎ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో బాలుడి వైద్యం నిమిత్తం రూ.పది లక్షల చెక్కును బుధవారం బాధితులకు అందించారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి – ఉంగుటూరు

కైకరం అరుంధతిపేట అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ బురద, గోతులతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు చెప్పగా జనసేన నాయకుడు, శ్రీకృష్ణదేవరాయ సంఘం నేత వెజ్జు సుబ్బారావు తన సొంత నిధులతో మెటల్ చిప్స్‌తో పూడ్చిపెట్టి మరమ్మతులు చేయించారు. దీంతో అంగన్‌వాడీ ఆవరణం అహ్లాదకరంగా ఉండటంతో పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా కైకరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థనా మందిరానికి వెజ్జు సుబ్బారావు రూ.పది వేలు అందించారు.

నేరాలు – ఘోరాలు

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి – ముసునూరు

కడుపు నొప్పి తాళలేక పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని లోపూడి శివారు బాసవరపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లోపూడి శివారు బాసవరపాడు గ్రామానికి చెందిన కోమటి శివకృష్ణ (37)కు బుధవారం కడుపు నొప్పి అధికంగా రావడంతో తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే శివకృష్ణను నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శివకృష్ణ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఎనిమిదో తరగతి, కుమార్తె ఐదో తరగతి చదువుతున్నారు. శివకృష్ణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఆయిల్ పామ్ రైతులకు తెలంగాణలో వలె గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు అన్నే భవనంలో ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆయిల్ పామ్ టన్ను గెలలకు ఇచ్చే ధర తెలంగాణ కంటే ఆంధ్రాలో తక్కువ ఉండడంతో మన రాష్ట్ర ఆయిల్ పామ్ రైతులు నష్టపోతున్నారన్నారు. టన్ను ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తికి రైతుకు రూ.18 వేలు ఖర్చవుతుంటే సెప్టెంబర్ నెలలో టన్ను గెలలకు రూ.14,590, ఆగస్టు నెలలో రూ.13,883 మాత్రమే రైతుకు ధర వచ్చిందని చెప్పారు. టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.18 వేలు ధర అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ఆధునీకరించాలని కోరారు.

అధిక ధరలు తగ్గించాలి

వ్యకాస ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి – కలిదిండి

నిత్యావసర సరుకులు, కూరగాయలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, ఇసుకను తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలిడింది ప్రధాన సెంటర్‌లో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలతో పేదలు, సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధరలు తగ్గించాలని కోరారు. తొలుత స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యకాస సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులు జి.సోమయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ ఆక్వా చెరువుల్లో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ పనుల్లేక పేదలు, వ్యవసాయ కూలీలు వలసబాట పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. డెల్టా ప్రాంతంలో వరి సాగు తగ్గి, చేపల చెరువులు అధికం కావడంతో పేదలు, యువకులు, దళితులు చేపల చెరువుల్లో పట్టుబడులకు వెళ్తున్నారన్నారు. చేపలు పట్టే కార్మికులకు కనీస వేతనాలు అమలు కాకపోవడం శోచనీయమన్నారు. కార్మిక శాఖ ద్వారా వారి సంక్షేమానికి నిధులు కేటాయించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు వీరవల్లి భాస్కరరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఘంటా సోమ య్య, పరసా రాజేష్, పి.జ్ఞానేష్, సత్యనారాయణ, వి.వరలక్ష్మి, ఎస్.మహాలక్ష్మి, జయదీప్తి, పి.సక్కుబాయి పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

నూజివీడు టౌన్ : గాంధీ చిత్రపటానికి మంత్రి నివాళులు

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

గాంధీజీని దేశప్రజలు ఎన్నటికీ మరువకూడదనిరాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడు రోటరీ ఫంక్షన్ హాలులో గాంధీ 155వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి మంత్రి కొలుసు పార్థసారధి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని మనం కూటమి ప్రభుత్వం ద్వారా సాధించుకుందామన్నారు. నూజివీడు నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులచే వేడుకలు నిర్వహించారు.

ఏలూరు స్పోర్ట్స్ : నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బందికి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి అదనపు ఎస్‌పి శేఖర్ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : గాంధీ చూపిన మార్గం అనుసరణీయమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి చెప్పారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో 155వ గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎతో పాటు మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులకు, నాయకులకు మిఠాయిలు పంచారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి మేయర్ నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఏలూరు అర్బన్ : జిల్లా కారాగారంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ జ్యుడిషియల్ జడ్జి ఎస్.ఉమాసునంద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కె.రత్నప్రసాద్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడారు. ఏలూరు ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఇరిగేషన్ ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, జలవనరుల శాఖ డివిజన్ సిబ్బంది గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డివిజన్ కార్యాలయాన్ని, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న జిల్లా రెడ్ క్రాస్ భవనంలో ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు, ఎఎన్‌ఎం నర్సింగ్ విద్యార్థినులు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో శ్రమదానం చేశారు. ఆర్‌ఆర్.పేటలోని గంగానమ్మ ఆలయం వద్ద ఉన్న చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ పూలమాల వేశారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడారు. సర్ సిఆర్.రెడ్డి కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.రామరాజు అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ ముఖ్య అతిథిగా హాజరై గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హిందూ యువజన సంఘము (వైఎంహెచ్ఎ) ఆధ్వర్యంలో వైఎంహెచ్ఎ హాలులో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

కొయ్యలగూడెం : కాంగ్రెస్ కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు గుత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దారం సత్తిరాజు, కిసాన్ సెల్ మండలాధ్యక్షులు బుచ్చిరాజు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు రాజారత్నం, సీనియర్ నాయకులు పొన్న రామచంద్రం పూలమాలలు వేశారు. మండల కేంద్రంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి ఆధ్వర్యంలో పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

చింతలపూడి : చింతలపూడి సబ్ జైలులో ఖైదీల దినోత్సవం, గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. నగర పంచాయతీ వద్ద గాంధీ చిత్రపటానికి, మెయిన్‌రోడ్డులోని గాంధీ విగ్రహానికి కమిషనర్ డి.పావని పూలమాల వేసి నివాళులర్పించారు.

దెందులూరు : దెందులూరు గ్రామం యాదవ్ నగర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

కామవరపుకోట : మండలంలోని పాతురులో మాజీ ఎంఎల్‌ఎ మురళీ రామకృష్ణ, టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. జనసేన కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ బొబ్బిలి వీరబాబు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి జనసేన నాయకులు పూలమాలలు వేశారు.

మండవల్లి : స్థానిక గాంధీ సేవ ఆశ్రమంలో ఇఒ దివ్యశ్రీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గాంధీ మండవల్లిలో సేద తీరిన ప్రాంతంలో గుర్తుగా సేవాశ్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఏడాది జయంతులు, వర్ధంతులు, స్వతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించి గొప్ప ప్రసంగాలు ఇచ్చి వెళ్లిపోతున్నారే తప్ప ఆశ్రమం అభివృద్ధికి ఎవరూ కృషి చేయడంలేదన్నారు.

ఉంగుటూరు : పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించిన గ్రామసభలకు ఆయా గ్రామాల సర్పంచులు అధ్యక్షత వహించారు. గాంధీ చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. నారాయణపురం కాలువగట్టున జనసేన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ముసునూరు : గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని 16 గ్రామాల్లో స్వచ్ఛత దివాస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెత్త సంపద కేంద్రాల వద్ద పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వలసపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో జిల్లా పంచాయతీ అధికారి సుందరి పాల్గొని మాట్లాడారు.

విగ్రహాలకు నివాళులర్పిస్తున్న బొరగం శ్రీనివాస్

గాంధీ ఆశయాలను, మార్గాలను పాటించాలి

ఎపి ఎస్‌టి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు

పోలవరం : గాంధీ ఆశయాలను, మార్గాలను ప్రతిఒక్కరూ పాటించాలని ఎపి ఎస్‌టి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్‌ఎన్‌డి పేట, కొత్తపట్టిసీమ, గూటాల పంచాయతీల్లో సర్పంచులు, స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కచేరి వద్ద జైళ్లశాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న పెట్రోలు బంకులో విధులు నిర్వహిస్తున్న ఖైదీలు గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్‌ఎన్‌డి పేట, పోలవరం పంచాయతీ కార్యాలయాల ఆవరణలో గ్రామసభలు నిర్వహించారు.

పోలవరం : గాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన విజ్ఞాన భవన్‌లో బుధవారం జరిగిన స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమంలో కొత్త పట్టిసీమ సర్పంచి మైగాపుల విజయదుర్గ పాల్గొని పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో ఎనిమిది పంచాయతీల నుంచి సర్పంచులు హాజరుకాగా, నూతనంగా ఏర్పడిన కొత్తపంచాయతీ కొత పట్టిసీమ గ్రామానికి తొలి సర్పంచిగా మైగాపుల విజయదుర్గ ఎన్నిక కావడం, ఉత్తమ పంచాయతీగా ఆమె ఆధ్వర్యంలో పంచాయతీ ఎంపిక కావడం, ప్రధాని మోడీ సభకు ఆహ్వానం అందడం విశేషం.

దెందులూరు : దెందులూరు బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయురాలు లావణ్య విద్యార్థులకు గాంధీ జీవిత చరిత్ర వివరించారు.

కుక్కునూరు : కుక్కునూరు ప్రధాన రహదారి కూడలిలో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి పెద్ద కొటాయి సెంటర్ వద్ద ఉన్న గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు ఆర్యవైశ్య ప్రముఖులు యండూరి శివరామ్, నరసింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అబ్దుల్‌సలాం, ఎం.సూరవరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అంకం వెంకటేశ్వరరావు, ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, తోటపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.శోభన్‌బాబు, తోటపల్లిలో సర్పంచి ఆరేపల్లి శ్రీపద్మ, ఆరేపల్లి శ్రీనివాసరావు గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ద్వారకాతిరుమల : పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం చేపట్టి పాఠశాల ప్రాంగణం అంతా శుభ్రం చేశారు. గాంధీ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేలేరుపాడు రూరల్ : మండలంలోని రుద్రంకోట గ్రామపంచాయతీలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి నాగపల్లి స్వర్ణలత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో ఉన్న నిధుల వివరాలు తెలపాలని, అభివృద్ధి కార్యక్రమాలు ఏమేమి చేశారో వాటికి ఎంత ఖర్చు అయిందో లిఖిత పూర్వకంగా చూపాలని గ్రామస్తులు కోరారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీలుగుమిల్లి బస్‌షెల్టర్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీలుగుమిల్లి, దర్భగూడెం సచివాలయాల్లో వేడుకలు నిర్వహించారు.

చాట్రాయి : ఎంపిడిఒ కార్యాలయంలో ప్రభుత్వాధికారులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చనుబండలో నిర్వహించిన వేడుకల్లో టిడిపి తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ గ్రామ సభ నిర్వహించారు.

ముదినేపల్లి : ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని శ్రీహరిపురం, పలుచోట్ల వేడుకలు నిర్వహించారు.

టి.నరసాపురం : మండలంలోని కేతవరం, మక్కినవారిగూడెం, బొర్రంపాలెం, టి.నరసాపురం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. కేతవరంలో గాంధీ విగ్రహానికి గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ జయవరపు శ్రీరామ్మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి : మట్టగుంట సచివాలయం వద్ద గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వేడుకలు నిర్వహించారు. సర్పంచి అంద్రాజు రత్నమణి, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సవ్యసాయితేజ, విఆర్ఒ ఏడుకొండలు, నాయకులుపాల్గొన్నారు.

చింతలపూడిలో తెరచి ఉన్న మాంసం దుకాణం

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

చింతలపూడి : గాంధీ జయంతి రోజు నాడు యథేచ్ఛగా చింతలపూడిలో మాంసం అమ్మకాలు జరిగాయి. పాత బస్టాండ్ వద్ద బిస్మిల్లా సాయి పావని చికెన్ సెంటర్‌లో మాంసం అమ్మకాలు జోరుగా సాగాయి. మాంసం కావాల్సిన వారికి లోపల నుంచి అందించారు. జయంతి రోజు మాంసం అమ్మకాలు చేయరాదన్న నియమాన్ని అమలు చెయలేదని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యతోనే ఉత్తమ సమాజ నిర్మాణం

ఏలూరు సిటీ : విద్యతోనే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని హేలాపురి బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వారిని దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించి అభినందించారు. అనంతరం ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబిఎస్.శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదని, సమాజ బాధ్యతని అభివర్ణించారు.

తాగునీరందించాలని నిర్వాసితుల వినతి

బుట్టాయగూడెం : పోలవరం నిర్వాసితులకు స్వచ్ఛమైన తాగునీరందించాలని, పునరావస కాలనీకి శ్మశానవాటిక స్థలం చూపాలని ములగలగూడెం(పెద్దూరు) గ్రామ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి బుధవారం వారు వినతిపత్రం అందించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ పాయం రమేష్, ఐఒపిఆర్‌డి ఎం.శ్రీహరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం మండలంలోని కోండ్రుకోట ములగలగూడెం(పెద్దూరు) గ్రామ నిర్వాసితులు మండలంలోని రెడ్డిగణపవరం పంచాయతీ వెలుతురువారి గూడెం వద్ద పునరావాస కాలనీలో 150 కుటుంబాల వారు ఉంటున్నారన్నారు. 2021లో పునరావాస కాలనీకి వచ్చారన్నారు. అప్పటి నుంచి నేటి వరకూ స్వచ్ఛమైన తాగునీరు లేక బయట కొనుక్కోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలనీలో ఒక విద్యుత్ మోటార్, మూడు చేతిపంపుల నుంచి సుద్ద నీరు వస్తుందని, అవి తాగితే కాళ్ల నొప్పులు వస్తున్నాయని చెప్పారు. తాగునీటి కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి తాగునీరు అందించాలన్నారు. పునరావాస కాలనీకి ఇప్పటివరకు శ్మశాన వాటిక స్థలం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శులు కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరరావు, నిర్వాసితులు ఎస్.విజయరత్నకుమారి, పి.రామారావు, పి.సంకురుదొర, మూలేం శారమ్మ, బి.దేవరాజు, ఎం.పండమ్మ, రాధ, గంగాభవాని పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

CHANGE OF NAME

I, SIRUGUBATTULA JAYA BHARGAVI, D/o. S.NAGARJUNA, resident of D.No. 12-46, Thimmanavidu, Eluru Road, Venkateswara Theatre, Epuru, West Godavari Dist, (A.P)-521105. I have changed my name from SIRIGUBATTULA JAYA BHARGAVI (Old Name) to SIRUGUBATTULA JAYA BHARGAVI (New Name) for future all purposes.

దావా సమను

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఏలూరు, ప.గో.జిల్లా వారి కోర్టులో

ఎఫ్.డి.పి.నెం.4/2024 ఇన్ ఒ.యస్.నెం.275/2016

బిట్వీన్:
దిరిశాల సుబ్బారావు ...పిటీషనర్/వాది
మరియు
దిరిశాల అప్పారావు మరియు ఇద్దరు (2) ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది:
గాది రాజు విజయ నరసింహారాజు, తండ్రి సూరిబాబు, రాజుల కాలనీ, శనివారపుపేట, ఏలూరు మండలం, ఏలూరు, ప.గో.జిల్లా.

పై నెంబరు గల దావాలో 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు పై నెంబరు దావాను ది.21-10-2024కు వాయిదా వేసినారు. కాబట్టి 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాదిపై నెంబరు దావాలో 21-10-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట హాజరుకావలెను. అట్లు హాజరుకానిచో 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది పరోక్షమందు పై నెంబరు గల దావాను శ్రీకోర్టు వారు తీర్మానించెదరు అని తెలపడమైనది.
కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
ఏలూరు **శ్రీ శెట్టి అప్పారావు,** అడ్వకేటు,
ది.03-10-24 ఏలూరు. సెల్:8341885888

IN THE COURT OF THE HON'BLE VIIth ADDL. DISTRICT JUDGE : ELURU

E.P.No.02/2021

O.S.No.177/2014

Between:
Sri Davuluri Hanumantha Rao ...DHR/Plaintiff
And
Smt.Gadde Venkata Lakshmi ...JDR/Defendant

పై నంబరు E.P లో JDR అయిన Smt. Gadde Venkata Lakshmi, W/o.Dharma Rao, R/o.D.No.4-58, Thimmapuram Village, D.Tirumala Mandal, W.G.Dist అను వారికి నోటీసుల అమలు కొరకు ది.4-10-24 వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు పైకోర్టు వారి ఎదుట ఉ.10.30 గం॥లకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గానీ వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఏలూరు **E.Srinivasa Babu**
తేది.27.09.2024 Advocate, Eluru.

మహారాజశ్రీ సివిల్ జడ్జి – జూనియర్ డివిజన్ (ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి) వారి కోర్టులో

O.S.57/2023

Between:
తిరుమాని వంశీకృష్ణంరాజు ...వాది
మరియు
మేకా శ్రీధర్‌చౌదరి, S/o.సత్యనారాయణ, డోరునెం.14-10-10/10, భాస్కర్ కాలేజి ప్రక్కన, నరసాపురం.
మరియు ఇద్దరు ...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంథములో మీరు ఒకటవ ప్రతివాది అయివున్నారు. పై నెంబరు గ్రంథము ది.21-10-2024 తేదికి వాయిదా అయివున్నది. పై నెంబరు గ్రంథములో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్ని మీకు అమలు జరుగనందున శ్రీకోర్టు వారు Substituted Service of Summons by way of Paper Publication ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన ఇవ్వడమైనది. కావున మీరు ది.21-10-2024వ తేదీన మీరు స్వయముగా కాని/మీ యొక్క ప్లీడరు గారి ద్వారా కాని, ఉదయం గం॥10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెయును. లేనియెడల సదరు గ్రంథము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో
ఓ.ఎన్.కృష్ణ M.A.,M.B.A., M.Com., M.L.
నరసాపురం అడ్వకేటు, తణుకు–534211.
తేది.02.10.24 సెల్: 9848199440

IN THE HON'BLE COURT OF THE FAMILY JUDGE CUM IIIRD ADDL DISTRICT JUDGE AT VIZIANAGARAM MOP NO 63/2024

Between:
Majji Bharat Kumar ....Petitioner
And:
Pulagala Subhan Babu and others .....Respondent
To
R2. Nuthangi Maheswara Rao, S/o Srinivasulu, R/o D.No.2-138, Surya Nagar, Pydiparru, Tanuku, West Godavari Dist.

Please take notice that the above named Petitioner filed M.V.O.P. 63/2024 against you and others for Compensastion on Accident of Injuries Sustained by him in a Motor Accident and the above matter Stands Posted on **10-10-2024** Hence you are directed to attend before the Hon'ble Court in Person or through an Advocate by **10-30 A.M** on 10-10-2024 failing which the Hon'ble Court will be hard and determined in your absance and made ex-party orders as per law.

Sri K.Srinivasa Rao,
Advocate, Nellimarla,
Vizianagaram,
Cell No : 9440282934

IN THE HONBLE COURT OF THE FAMILY JUDGE CUM IIIRD ADDL DISTRICT JUDGE AT VIZIANAGARAM MOP NO 62/2024

Between:
Majji Vijaya Durga Prasanna ....Petitioner
And:
Pulagala Subhan Babu and others .....Respondent
To
R2. Nuthangi Maheswara Rao, S/o Srinivasulu, R/o D.No.2-138, Surya Nagar, Pydiparru, Tanuku, West Godavari Dist.

Please take notice that the above named Petitioner filed M.V.O.P. 62/2024 against you and others for Compensastion on Accident of Injuries Sustained by him in a Motor Accident and the above matter Stands Posted on **10-10-2024** Hence you are directed to attend before the Hon'ble Court in Person or through an Advocate by **10-30 A.M** on 10-10-2024 failing which the Hon'ble Court will be hard and determined in your absance and made ex-party orders as per law.

Sri K.Srinivasa Rao,
Advocate, Nellimarla,
Vizianagaram,
Cell No : 9440282934